సాక్షి
నారాయణపేట
శనివారం । 7 । డిసెంబర్ । 2024



జడ్చర్లలో అమృత్ 2.0 సర్వే

అమృత్ 2. 0 ద్వారా చేపట్టిన డిజిటల్ సర్వే జడ్చర్లలో ప్రారంభమైంది.

వివరాలు 8లో ▸



మౌలిక వసతులు కల్పించాలి

పీయూ పరిధిలోని కళాశాలల్లో మౌలిక వసతులు కల్పించాలని వీసీ అన్నారు.

వివరాలు 8లో ▸

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం 33.3 /19.7

రోజంతా సాధారణ ఉష్ణోగ్రతలే నమోదవుతాయి. మధ్యాహ్నం ఎండ ఉంటుంది. రాత్రి చలి తీవ్రత పెరుగుతుంది.

న్యూస్‌రీల్

పాలమూరుకు నవోదయ విద్యాలయం మంజూరు

పాలమూరు: తెలంగాణకు కేంద్ర ప్రభుత్వం ఏడు జవహర్ నవోదయ విద్యాలయాలు మంజూరు చేయగా అందులో ఒకటి మహబూబ్‌నగర్ జిల్లా కూడా ఉండటం విశేషం. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు జిల్లాకు నవోదయ విద్యాలయం ప్రకటించిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి ఎంపీ డీకే అరుణ కృతజ్ఞతలు తెలిపారు. నవదోయ విద్యాలయం జిల్లాకు రావడం వల్ల పాలమూరులోని పేద విద్యార్థులకు ఎంతో మేలు జరుగుతుందని ఆమె అభిప్రాయపడ్డారు. వచ్చే విద్యా సంవత్సరంలో ప్రారంభం కానున్న ఈ పాఠశాలలో 560 మంది విద్యార్థులకు ప్రవేశం కల్పించనున్నారు.

రాజీ మార్గమే రాజ మార్గం

నారాయణపేట: రాజీమార్గమే రాజమార్గమని.. 14వ తేదీన నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని ఎస్పీ యోగేష్ గౌతమ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో వివిధ రకాల రాజీపడదగు కేసులలోని కక్షిదారులకు ఉచిత న్యాయ సేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో డిసెంబర్ 14న వరకు నారాయణపేట, కోస్గి కోర్టులలో నేషనల్ లోక్ అదాలత్ సందర్భంగా కక్షిదారులకు అందుబాటులో ఉంటారని తెలిపారు. ఏమైనా కేసులు ఉంటే వాటిని రాజీ చేసుకొని కోర్టుకు హాజరైనట్లయితే ఆ కేసులను పూర్తిగా క్లోజ్ చేయనున్నట్లు తెలిపారు. యాక్సిడెంట్, దాడి, చీటింగ్, వివాహ బంధానికి సంబంధించిన కేసులు, డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు, ఇతర రాజీ పడదగు కేసులను జాతీయ లోక్ అదాలత్ ద్వారా సత్వరమే పరిష్కరించుకుని న్యాయం పొందవచ్చుని సూచించారు. జిల్లా వ్యాప్తంగా బాధితులకు మంచి అవకాశమని తెలిపారు.

ప్రభుత్వ భవనాలకు శంకుస్థాపన

కొత్తపల్లి/కోస్గి రూరల్: ప్రజాపాలన దినోత్సవాల్లో భాగంగా కొడంగల్‌లో శుక్రవారం రాష్ట మంత్రులు శ్రీధర్‌బాబు, దామోదర రాజనర్సింహ, జూపల్లి కృష్ణారావు కొత్తపల్లి, గుండుమాల్ మండల సమీకృత భవనాలకు శుక్రవారం వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. వీటికి రూ.17.60 కోట్లు మంజూరైన విషయం తెలిసిందే. వీటితోపాటు కొత్తపల్లి మండలంలో భూనీడు పాఠశాల అదనపు గదులకు, నిజ్జింత, అల్లీపూర్, గోకుల్‌నగర్, గొర్లోనిబాయి, ఎక్కామేడు అంగన్‌వాడీ భవన నిర్మాణ పనులకు శంకుస్థాపనలు నిర్వహించారు. కార్యక్రమంలో తాండూరు ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి, పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ గురునాథ్ రెడ్డి, కలెక్టర్ ప్రతీక్ జైన్, కడా ప్రత్యేకాధికారి వెంకట్ రెడ్డి, కొడంగల్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

ఆర్టీసీని లాభాల బాటలో నడిపిద్దాం

నాగర్‌కర్నూల్/ అచ్చంపేట రూరల్: సమష్టి కృషితో ఆర్టీసీని లాభాల బాటలో నడిపిద్దామని రీజినల్ మేనేజర్ సంతోష్‌కుమార్ అన్నారు. మహబూబ్‌నగర్ రీజినల్ మేనేజర్‌గా బాధ్యతలు చేపట్టిన ఆయన శుక్రవారం మొదటిసారిగా నాగర్‌కర్నూల్, అచ్చంపేటలోని ఆర్టీసీ డిపోలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయా డిపోల్లోని అన్ని విభాగాలను పరిశీలించి ఉద్యోగులతో మాట్లాడారు. నాగర్‌కర్నూల్ డిపో అక్టోబర్ వరకు రూ.8 కోట్ల లాభంలో ఉందని, భవిష్యత్‌లోనూ ఇలాగే పని చేసి లాభాలను కొనసాగించాలన్నారు. ఫేర్ పెయిడ్ ప్యాసింజర్ల సంఖ్య పెంచాలని, గ్యారేజీ ఉద్యోగులు బస్సులను జాగ్రత్తతో మెయింటెనెన్స్ చేసి ఆన్‌లైన్‌లో ఫెయిల్యూర్ కాకుండా చూడాలని చెప్పారు. విధుల పట్ల అలసత్వం వహించే సిబ్బందిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. తొలిసారి డిపోలను సందర్శించిన ఆర్ఎంను ఘనంగా సన్మానించారు. డిపో మేనేజర్లు యాదయ్య, ప్రసాద్, అసిస్టెంట్ మేనేజర్ బాలసరస్వతి, ఎంఎఫ్ భాస్కర్, సీఐ దేవి, ఏడీసీలు గ్యారేజ్ సిబ్బంది, డ్రైవర్లు, కండక్టర్లు పాల్గొన్నారు.

హోంగార్డుల వేతనం పెంపు

- ఉమ్మడి జిల్లాలో 800 మందికి మేలు

మహబూబ్‌నగర్ క్రైం: హోంగార్డ్స్ దినోత్సవం సందర్భంగా రాష్ట్రంలోని హోంగార్డులకు వేతనాలు పెంచుతూ రాష్ట ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఉమ్మడి జిల్లాలో 800 మంది హోంగార్డులు ఉండగా దీంట్లో మహబూబ్‌నగర్ జిల్లాలో 182, గద్వాల 129, నాగర్‌కర్నూల్ 149, వనపర్తి 133, నారాయణపేటలో 116మంది విధులు నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం హోంగార్డులకు రోజువారి వేతనం రూ.921 ఇస్తుండగా వాటిని రూ.వెయ్యికి పెంచింది. ఒక్కొక్కరి వేతనంలో రూ.79లు అదనంగా పెంచుతూ ఉత్తర్వులు జారీ చేసింది. అదేవిధంగా వీక్లీ పరేడ్ అలవెన్స్‌ను రూ.వంద నుంచి రూ.200లకు పెంచారు. దీంతో పాటు విధుల్లో ఉండి సహజంగా లేదా రోడ్డు ప్రమాదాల్లో మరణించిన హోంగార్డుల కుటుంబాలకు రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వనున్నారు. శుక్రవారం రాత్రి పరేడ్ మైదానంలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలభిషేకం చేశారు.



మక్తల్ ప్రధాన రోడ్డుపై సంచరిస్తున్న వీధి కుక్కలు



జిల్లా కేంద్రంలోని లాల్‌మసీదు సమీపంలో ఇటీవల కుక్కల దాడితో తీవ్రంగా గాయపడిన ఫారియానాజ్ (ఫైల్)

వీధి కుక్కలతో భయం.. భయం

జిల్లాలో ఏడాదిలో 4,691 కుక్కకాటు కేసులు

- గుంపులుగా తిరుగుతూ జనాలపై దాడి
- బాధితులు అధికంగా చిన్నారులే..
- రాత్రి వేళ బయటికి వెళ్లాలంటేనే భయాందోళనలో పాదచారులు
- నివారణ చర్యలు చేపట్టడంలో అధికారుల మీనమేషాలు



సాక్షి ఫోకస్

నారాయణపేట: జిల్లాలోని నారాయణపేట, మక్తల్, కోస్గి మున్సిపాలిటీల్లో వీధికుక్కలంటేనే జనాలు భయాందోళన వ్యక్తం చేసే పరిస్థితి నెలకొంది. పగలు, రాత్రి గుంపులు, గుంపులుగా కుక్కలు స్వైర్య విహారం చేస్తుండడంతో జంకుతున్నారు. కుక్కకాటుకు గురవుతూ చిన్నారులు ఆస్పత్రిల పాలవుతున్న సంఘటనలు అనేకం ఉన్నాయి. ప్రతి మున్సిపాలిటీలలో పెద్ద సంఖ్యలు కుక్కలు గుంపులుగా సంచరిస్తూ వీధుల్లో ఆడుకుంటున్న చిన్నారులపై, రాత్రివేళ ఒంటరిగా బయటికి వెళ్లిన వారిపై, వాహనాలపై వెళ్లినా వారి వెంట పరుగెత్తి దాడి చేయడంతో భయాందోళన చెందుతున్నారు. దీంతోపాటు అకస్మాత్తుగా డివైడర్లపై నుంచి కుక్కలు రోడ్లపైకి రావడంతో వాహనదారులు అయోమయానికి గురై కిందపడి గాయపడుతున్నారు. ఇలాంటి సంఘటనలు జిల్లాకేంద్రంలో ఎక్కువగా చోటు చేసుకుంటున్నాయి. జిల్లాలో గడిచిన ఏడాది కాలంలో అధికారికంగా 4,691 మంది కుక్కకాటు బారినపడి ప్రభుత్వ ఆసుపత్రులలో చికిత్స పొందినట్లు రికార్డులు చెబుతున్నాయి. అనధికారికంగా ఇంకెంతమంది ప్రైవేటు ఆసుపత్రులలో చికిత్సలు పొంది ఉంటారో అర్థం చేసుకోవచ్చు.



కోస్గిలో కుక్కల స్వైర విహారం

జిల్లాలో కుక్క కాటు కేసుల వివరాలిలా..

నెల	నమోదైన కేసులు
జనవరి	484
ఫిబ్రవరి	444
మార్చి	488
ఏప్రిల్	463
మే	468
జూన్	420
జూలై	332
ఆగస్టు	367
సెప్టెంబర్	355
అక్టోబర్	419
నవంబర్	451



సమస్యాత్మక ప్రాంతాలు ఇవే..

ఏటా కుక్కలు ప్రజలపై దాడి చేసి గాయపర్చడం సాధారణంగా మారింది. ఈ ఏడాది వాటి బెడద మరింత తీవ్రమయ్యే అవకాశం ఉంది. వాటి నియంత్రణకు మున్సిపల్ యంత్రాంగం ప్రత్యేక కార్యాచరణతో ముందుకెళ్లాల్సిన అవసరం ఉంది. అయితే కుక్కల సంతతి నానాటికీ వృద్ధి చెందడానికి కారణం ఆయా పట్టణాల్లోని వాతావరణమే. హోటళ్లు, ఫంక్షన్ హాల్స్, ఫాస్టు ఫుడ్ కేంద్రాలు, మాంసం, చికెన్ దుకాణాలు... వాటి ఆహార లభ్యతకు చిరునామాగా ఉంటున్నాయి. అక్కడే తిష్టవేసి ఆశ్రయం పొందుతున్నాయి. ఈ క్రమంలోనే గుంపులు గుంపులుగా స్వైర విహారం చేసి స్థానికులను గాయపర్చుతున్నాయి. రాత్రి వేళ విధులు ముగించుకని వచ్చేవారితో పాటు, ముఖ్యంగా వేకువ జామున వాకింగ్‌కు వెళ్లే వారు, రాత్రి వేళ అత్యవసర నిమిత్తం ఆసుపత్రి, రైల్వే స్టేషన్, బస్టాండ్‌కు వేళ్లే వారికి కుక్కలు ఇబ్బందుల్ని కలిగిస్తున్నాయి. మున్సిపాలిటిలతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో సైతం కుక్కకాటు గురైన సంఘటనలు ఉన్నాయి.

“

రోడ్లపై గుంపులు గుంపులుగా..



మక్తల్ మెయిన్ బజార్ నుంచి వినాయక నగర్ వరకు, వెంకటరమణ కాలనీ, మటన్ మార్కెట్ దగ్గర కుక్కలు అధికంగా ఉంటాయి. నిత్యావసర వస్తువుల కోసం షాపులకు వెళ్దామంటే రోడ్లపై గుంపులు గుంపులుగా ఉండే కుక్కలను చూసి భయపడుతున్నాం.

– వెంకటేష్, మక్తల్

అదమరిస్తే అంతే..



నారాయణపేట చిల్డ్రన్స్ హాస్పిటల్ వద్ద వీధి కుక్కల బెడద తీవ్రమైంది. పక్కనే ఉన్న సమీకృత మాంసాహార మార్కెట్ వద్ద మాంసానికి అలవాటు పడి గుంపులు, గుంపులుగా వస్తాయి. పాత బస్టాండ్ చుట్టూ ఉన్న హోటళ్ల వద్ద నిత్యం సంచరిస్తూ.. ఇక్కడి హోటల్ ముందు ఏర్పాటుచేసిన చెత్త డబ్బాలను చిందర వందర చేస్తాయి. పక్కనే ఉన్న చిల్డ్రన్ హాస్పిటల్ కాంపౌండ్ లో సంచరిస్తుంటాయి. చిన్నారుల సంరక్షకులు ఆదమరిస్తే వారిపై దాడి చేసే ప్రమాదం లేకపోలేదు.

– మల్లేశ్‌గౌడ్, మహిళా క్యాంటిన్ నిర్వాహకుడు, నారాయణపేట

జనాలను కాపాడాలి



కోస్గి పట్టణంలో వీధి కుక్కల బెడద ఎక్కువగా ఉంది. గత నెలలో కుక్క కాటు వేయడంతో వైద్యం చేయించుకొని టీకాలు వేసుకోవాల్సి వచ్చింది. పిల్లలను బయటకు పంపాలంటేనే భయం వేస్తుంది. మున్సిపల్ అధికారులు కుక్కల నివారణకు వెంటనే చర్యలు తీసుకొని ప్రజలను వాటి బారి నుంచి కాపాడాలి.

– అమరేశ్వర్, కోస్గి,

నివారణ చర్యలు చేపట్టాం



నారాయణపేట మున్సిపల్ పరిధిలోని వీధి కుక్కలను గుర్తించి వాటి సంతానం పెరగకుండా కుటుంబ నియంత్రణకు 273 కుక్కలకు శస్త్ర చికిత్సలు చేయించాం. త్వరలోనే మిగతా వాటికి శస్త్ర చికిత్సలు చేయిస్తాం.

– సునీత, మున్సిపల్ కమిషనర్, నారాయణపేట

మున్సిపాలిటీల్లో చేపడుతున్న చర్యలు

- మక్తల్ మున్సిపాలిటీలో దాదాపు 350 కుక్కలు ఉన్నట్లు గుర్తించారు. వీటిని పట్టుకోవడానికి వాహనం ఏర్పాటు చేసేందుకు రూ.7 లక్షలు మున్సిపల్ సమావేశంలో తీర్మానం చేశారు. కుక్కల నివారణ చర్యలు చేపట్టడానికి రూ.4 లక్షలు కేటాయించి యానిమల్ వెల్ఫేర్ సొసైటీకి ఆ బాధ్యతను అప్పగించారు.
- కోస్గి మున్సిపాలిటీలో కుక్కలకు కుటుంబ నియంత్రణ కోసం రూ. 5 లక్షలు బడ్జెట్ కేటాయించారు.
- నారాయణపేట మున్సిపాలిటీలోని 24 వార్డులో 725 వీధి కుక్కలు ఉన్నట్లు గుర్తించారు. ప్రధానంగా మటన్ మార్కెట్, బహర్‌పేట, అశోక్ నగర్ ఏరియాల్లో కుక్కల బెడదతో పలువురు గాయాలు కావడంతో వాటిని నివారించేందుకు మున్సిపల్ అధికార యంత్రాంగం ప్రత్యేక చర్యలు చేపట్టింది. యానిమల్ వెల్ఫేర్ సొసైటీతో అగ్రిమెంట్ చేసుకొని ఒక్కో కుక్కకు రూ.1650 చెల్లిస్తూ.. ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో 274 కుక్కలకు కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేయించారు. ఆ తర్వాత వారు రాకపోవడంతో బ్లూక్రాస్ సొసైటీ హైదరాబాద్ వారికి కుటుంబ నియంత్రణ చేయించేందుకు మున్సిపల్ అధికార యంత్రాంగం చర్యలు చేపట్టింది. కుక్కల నివారణ చర్యలను తూతూ మంత్రంగా కాకుండా పటిష్టంగా చేపట్టాలని.. వాటి సంఖ్య పెంచకుండా తగు చర్యలు తీసుకోవాలని.. కుక్కల దాడి నుంచి ప్రధానంగా చిన్నారులను కాపాడాలని ప్రజలు కోరుతున్నారు. అలాగే, మటన్, చికెన్ షాపులు, హోటళ్ల నిర్వాహకులను మిగిలిన పదార్థాలను ఎక్కడపడితే అక్కడ పారబోయకుండా చూసేలా అవగాహన కల్పించాలని కోరుతున్నారు.

చివరి గింజ వరకు కొనుగోలు చేస్తాం



ధాన్యాన్ని పరిశీలిస్తున్న ఇన్‌చార్జ్ కలెక్టర్ ప్రతీక్‌జైన్

కోస్గి రూరల్: అకాల వర్షంతో కొందరు రైతుల ధాన్యం తడిచిందని.. అలాంటి వారు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, చివరి గింజ వరకు ధాన్యం కొనుగోలు చేస్తామని జిల్లా ఇన్‌చార్జ్ కలెక్టర్ ప్రతీక్‌జైన్ అన్నారు. శుక్రవారం కోస్గి, గుండుమాల్ మండలంలోని కోమ్మూర్, చెన్నారం గ్రామాల్లోని ఐకేపి కేంద్రాలను సందర్శించారు. అక్కడి రైతులతో మాట్లాడుతూ ఎన్ని ఎకరాలు సాగుచేశారు, ఎన్ని బస్తాల ధాన్యం పండింది, ఇటీవల వర్షాలకు ధాన్యం తడిసిందా.. అని ఆరా తీశారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు ధాన్యాన్ని తీసుకువచ్చి మద్దతు ధరతో కూడిన బోనస్ పొందాలని అన్నారు. కొనుగోలు కేంద్రాలలో సేకరించిన ధాన్యాన్ని మిల్లులు, గోదాములకు తరలించాలన్నారు. కేంద్రాలలో అవసరమైన టార్పాలిన్లు, యంత్రాలు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ రాంచందర్, సివిల్ సప్‌లైడీఎం దేవరాజ్, పౌరసరఫరాల అధికారి సుదర్శన్, తహసీల్దార్లు బక్క శ్రీనివాస్,భాస్కర్‌స్వామి తదితరులు ఉన్నారు.

అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి



మక్తల్‌లో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి తదితరులు

మక్తల్: అట్టడుగు వర్గాల ఆశాజ్యోతి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అని ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి అన్నారు. శుక్రవారం అంబేడ్కర్ వర్ధంతిని పురస్కరించుకొని మక్తల్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి ఎమ్మెల్యే పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ.. స్వేచ్ఛ, సమానత్వం, సముచిత స్థానం కోసం కృషి చేసిన మహనీయుడు అంబేడ్కర్ అని కొనియాడారు. భారత రాజ్యాంగ రచన సంఘం అధ్యక్షుడిగా దేశానికి విశిష్ట సేవలు అందించిన మేధావి, ఆర్థికవేత్త, న్యాయనిపుణుడు, రాజకీయవేత్త సంఘ సంస్కర్తగా పేర్కొన్నారు. ఆయన జీవితం అణగారిన వర్గాల సంక్షేమానికి అంకితం చేశారన్నారు. ఆయన ఆశయ సాధనకు అందరు కలిసికట్టుగా కృషి చేద్దామన్నారు. ఇదిలా ఉండగా, ఇతర పార్టీల నాయకులు, కుల సంఘాలు, పాఠశాలల్లో అంబేడ్కర్‌కు ఘన నివాళులర్పించారు. పట్టణంలో అంబేడ్కర్ సంఘం, వివిధ సంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ర్యాలీ

హామీలు అమలు చేసే వరకు పోరు



మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర నాయకుడు నాగురావు నామాజీ

నారాయణపేట రూరల్: కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారెంటీ హామీలు అమలు చేసే వరకు పోరు తప్పదని బీజేపీ రాష్ట్ర సీనియర్ నేత, క్రమశిక్షణ సంఘం సభ్యుడు నాగురావు నామాజీ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం గ్యారెంటీలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ భారీ మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనతోపాటు పార్టీ జిల్లా అధ్యక్షుడు పి.శ్రీనివాసులు మాట్లాడుతూ.. ఆరు గ్యారెంటీల గారడితో 6 అబద్దాలు 66 మోసాలతో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందన్నారు. రైతు రుణమాఫీ, ఏడాది అయినా రైతు భరోసా లేదని, మహాలక్ష్మి పేరుతో మహిళలను మోసం చేశారని అన్నారు. అలాగే వృద్ధులకు చేయూత అందించలేదని, యువత వికాసం మరిచారని, సొంతిల్లు కలగానే మిగిలి పోయిందని విమర్శించారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ దోచుకోవడంలో రెండు పార్టీలు ఒక్కటేనని, పదేళ్ల బీఆర్ ఎస్ కే.ట్యాక్స్ ఇప్పుడు కాంగ్రెస్ ఆర్ ఆర్ ట్యాక్స్ చెల్లిస్తుందని ఎద్దేవా చేశారు. ప్రజాస్వామ్యాన్ని పాతర వేశారని ప్రజలు వీరి పాలనలో భూమి, ఇళ్ల కోల్పోయారని, రాష్ట్రాన్ని అప్పుల కుప్పలు చేశారని ఆందోళన వ్యక్తం చేశారు. చేసింది చెప్పుకునేందుకు ఏమి లేక నాడు కేసీఆ,ర్ నేడు రేవంత్‌రెడ్డి ప్రధానిపై అసందర్భ విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. ప్రధానిని, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిని విమర్శించే అర్హత లేదని అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అమలు చేసిన గ్యారెంటీలపై శ్వేతపత్రం ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఇకనైనా విమర్శించే ముందు ఆలోచించి మాట్లాడితే బాగుంటుందని హితవు పలికారు. సమావేశంలో నాయకులు రామచంద్రయ్య, రఘురామయ్య గౌడ్, సత్య యాదవ్, వెంకట్ రాములు, తిరుపతిరెడ్డి, నర్సింహులు, తిరుపతి రెడ్డి, మల్లయ్య, వెంకటయ్య, గోపాల్ యాదవ్, సాయిబన్న పాల్గొన్నారు.

ఆటల పండుగకు వేళాయె..!

- నేటి నుంచి సీఎం కప్ క్రీడా పోటీలు
- విద్యార్థులు, యువతకు అవకాశం
- పోటీల నిర్వహణకు ప్రత్యేక ఏర్పాట్లు.. జిల్లాకు రూ.6 లక్షల నిధులు మంజూరు



జిల్లా కేంద్రంలో కబడ్డీ ప్రాక్టీస్ చేస్తున్న విద్యార్థినులు

నారాయణపేట రూరల్/నర్వ: విద్యార్థులు.. యువత సెల్‌ఫోన్‌తోపాటు ఇతర వ్యసనాలకు బానిసలు కాకుండా.. వారిని శారీరక దృఢత్వం, మానసిక ప్రశాంతతను అందించే క్రీడల వైపునకు మళ్లించేందుకు రాష్ట ప్రభుత్వం సన్నద్ధమైంది. ఈ మేరకు గ్రామీణ ప్రాంతాల నుంచి మండల, జిల్లా స్థాయిలో ఆటల పోటీల్లో పాల్గొని రాణించిన క్రీడాకారులను రాష్ట్రస్థాయిలో నిర్వహించే సీఎం కప్ క్రీడల్లో పాల్గొనే అవకాశం కల్పిస్తూ దాదాపు నెల రోజుల పాటు క్రీడా పండగను నిర్వహిస్తున్నారు.ఈ నెల 7 నుండి 21 వరకు గ్రామ, మండల, జిల్లా స్థాయిలో పోటీలు నిర్వహించేందుకు అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు. క్రీడల్లో పాల్గొనేందుకు క్రీడాకారులు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకునేందుకు ప్రత్యేక పోర్టల్‌ను సైతం ఏర్పాటు చేశారు.

ప్రణాళిక ఇలా..

ఈ నెల 7, 8 తేదీల్లో గ్రామ స్థాయిలో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ పోటీలు నిర్వహించనున్నారు. 10, 11, 12 తేదీల్లో ఇవే అంశాల్లో మండల స్థాయి పోటీలు నిర్వహించనున్నారు. ఈ నెల 16 నుంచి 21 వరకు 17 క్రీడాంశాల్లో జిల్లా స్థాయి పోటీలు నిర్వహించనున్నారు. గ్రామ, మండల స్థాయిలో నిర్వహించనున్న పోటీలను మినహాయించి మిగిలిన అన్ని క్రీడాంశాలకు గాను నేరుగా జిల్లా స్థాయికి దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. తొలత పంచాయతీ స్థాయిలో అథ్లెటిక్స్, ఫుట్‌బాల్, వాలీబాల్, కబడ్డీ, యోగా, అనే ఆరు క్రీడాంశాల్లో పోటీలు నిర్వహించి ఆయా జట్లను మండల అర్బన్ స్థాయికి పంపిస్తారు. ఇక్కడ కూడా అవే ఆరు అంశాల్లో పోటీలు ఉంటాయి. అనంతరం జిల్లా స్థాయిలో అథ్లెటిక్స్, బ్యాడ్మింటన్ బాక్సింగ్, ఈత రెస్లింగ్, బాస్కెట్‌బాల్, హ్యాండ్‌బాల్, ఫుట్‌బాల్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, యోగా, చదరంగం, బేస్ బాల్, నెట్‌బాల్, కిక్‌బాక్సింగ్, సైక్లింగ్, జూడో, స్నూకర్ ఇలా 20 క్రీడాంశాల్లో పోటీలు నిర్వహించి విజేతలను రాష్ట స్థాయికి పంపిస్తారు. హైదరాబాద్‌లో నిర్వహించే పోటీలకు ఉమ్మడి జిల్లాలో ఏర్పాట్లు చేశారు. విజేతలు 27 నుంచి 2025 జనవరి 2 వరకు జరిగే రాష్ట స్థాయి పోటీల్లో పాల్గొంటారు.

పోటీల నిర్వహణకు ప్రత్యేక కమిటీలు

సీఎం కప్ క్రీడా పోటీల నిర్వహణకు జిల్లాకు రూ.6 లక్షల నిధులను కేటాయించిన ప్రభుత్వం పోటీల నిర్వహణకు ప్రత్యేక కమిటీలను నియమించింది. గ్రామ స్థాయిలో కార్యదర్శి చైర్మన్‌గా, ప్రధానోపాధ్యాయుడు కన్వీనర్‌గా, వ్యాయామ ఉపాధ్యాయుడు, వీఏ సభ్యులుగా ఉంటారు. మండల స్థాయిలో ప్రత్యేక అధికారి చైర్మెన్‌గా ఎంపీడీఓ కన్వీనర్‌గా, తహసీల్దార్, ఎస్ఐ ఎస్డీఎఫ్ సభ్యుడు సీనియర్ క్రీడాకారుడు సభ్యులుగా ఉంటారు.జిల్లా స్థాయిలో కలెక్టర్ చైర్మెన్‌గా, ఎస్పీ వైస్ చైర్మెన్‌గా అదనపు కలెక్టర్ కో వైస్ చైర్మెన్‌గా, డీవైఎస్‌వో కన్వీనర్‌గా, జిల్లా ఒలంపిక్‌కార్యదర్శి డీఆర్‌డీఓ, జడ్పీ సీఈఓ, డీపీఓ, డీఐఈఓ, డీఈఓ, డీఎంహెచ్ఓ, ఎస్డీఎఫ్ కార్యదర్శి, పుర కమీషనర్, డీపీఆర్‌ఓలు సభ్యులుగా వ్యవహరిస్తారు. ఇదిలాఉండగా,

నేడే ప్రారంభం

క్రీడాపోటీల నిర్వహణ కమిటీలను ఇప్పటికే అధికారులు పూర్తి చేశారు. నేడు సీఎం కప్ పోటీలను నారాయణపేట నియోజకవర్గంలోని జాజాపూర్ పాఠశాలలో ఎమ్మెల్యే పర్ణికారెడ్డి, మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరీ జక్లేర్ పాఠశాలలో ఉదయం 7 గంటలకు ప్రారంభిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

పకడ్బందీ నిర్వహణ



ఈ నెల 7 నుంచి మండల స్థాయి నుంచి నిర్వహించే సీఎం కప్ పోటీల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. మండల స్థాయిలో నిర్వహించే క్రీడల గురించి సంబంధితత అధికారులకు విన్నవించాం. క్రీడల నిర్వహణ కోసం పీఈటీలను అలాట్ చేశాం. పీఈటీలు లేని ప్రాంతాల్లో కోచ్‌ల ద్వారా నిర్వహణ పూర్తి చేయ్యడానికి సంబంధిత మండల అధికారులకు విన్నవించాం. 15 నుంచి 36 సంవత్సరాల లోపు గల యువతీ, యువకులు సైతం పాల్గొనేలా ఆయా గ్రామాల ప్రజాప్రతినిదులు చొరవ చూపాలి.

– వెంకటేష్‌శెట్టి, డీవైఎస్ఓ

విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో చదవాలి

కృష్ణా: ప్రతి విద్యార్థి కూడా ఉన్నత లక్ష్యం నిర్దేశించుకొని.. దానిని చేరుకునేందుకు క్రమశిక్షణతో చదవాలని రాష్ట ఎస్‌సీఈఆర్‌టీ ఎస్ఆర్‌జీ, పాఠ్య పుస్తక రచయిత ఈడీ మధుసూదన్ రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని కున్సీ ఉన్నత పాఠశాలను ఆయన సందర్శించారు. అనంతరం ఆయన విద్యార్థుల విద్యా సామర్థ్యాలను పరిశీలించి, వారితో మాట్లాడారు. ప్రణాళికబద్ధంగా చదివితే 10వ తరగతి పరీక్షల్లో మెరుగైన గ్రేడ్‌తో ఉత్తీర్ణత సాధించడం సులభమని అన్నారు. పరీక్షల విషయంలో నిర్లక్ష్యం చేయకుండా, ఏమరుపాటుకు గురికాకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన సలహాలను వివరించారు. హెచ్ఎం సంతోషి, ఉపాధ్యాయులు నర్సిములు,నరేందర్,ఖాసీం అలీ,ఉష,సౌమ్య,భారతి,నాగేష్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న మధుసూదన్‌రెడ్డి

జడ్చర్లలో అమృత్ 2.0 సర్వే


డ్రోన్ సర్వేను ప్రారంభిస్తున్న చైర్‌పర్సన్, కమిషనర్

- డిగ్రీ కళాశాల మైదానంలో డ్రోన్ పాయింట్ సర్వే
- మున్సిపాలిటీలోని ప్రతి ఇల్లు ఇక డిజిటలైజేషన్
- సర్వే అనంతరం డీటీసీపీకి బేసిక్ మ్యాప్ అప్పగింత
- మాస్టర్‌ప్లాన్ అమలుకు కీలకం కానున్న డిజిటల్ సర్వే

జడ్చర్ల టౌన్: అమృత్ 2. 0 ద్వారా మున్సిపాలిటీ పరిధిలో శుక్రవారం సర్వే ఆఫ్ ఇండియా బృందం అర్బన్ టౌన్ ప్లానింగ్ ఆఫ్ ఇండియా సంయుక్తంగా చేపట్టిన డిజిటల్ సర్వే జడ్చర్ల మున్సిపాలిటీలో ప్రారంభమైంది. పట్టణాల అభివృద్ధి కోసం రాష్ట్రంలోని 20 మున్సిపాలిటీలను అమృత్ 2.0 కింద డిజిటల్ సర్వే చేపట్టాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని మున్సిపాలిటీల్లో డిజిటల్ సర్వేకు ఎంపికైంది జడ్చర్ల ఒక్కటే కావడం విశేషం. సర్వేలో భాగంగా పట్టణ విస్తీర్ణంతోపాటు అటవీ ప్రాంతం, చెరువులు, కుంటలు, నాలాలు, నివాసాలు కుటుంబాల గుర్తింపుతో కూడిన బేస్‌మ్యాప్ సిద్ధం చేయనున్నారు.


డ్రోన్‌తో సర్వే చేస్తున్న సర్వేయర్

డ్రోన్ సహాయంతో..

డ్రోన్ సహాయంతో చేపట్టిన డిజిటల్ సర్వేను మున్సిపల్ చైర్‌పర్సన్ పుష్పలత, కమిషనర్ లక్ష్మారెడ్డి శుక్రవారం డిగ్రీ కళాశాల మైదానంలో ప్రారంభించారు. సర్వేలో ఏ అంశాలు నమోదు చేస్తారు అనే విషయాలను సర్వే ఆఫ్ ఇండియా సభ్యులు వారికి తెలియజేశారు.

డిగ్రీ కళాశాల మైదానం కేంద్రంగా..

మున్సిపాలిటీ 35 స్క్వేర్ కి.మీటర్లు డ్రోన్ సహాయంతో డిజిటల్ సర్వే చేయనున్నారు. పదిరోజులపాటు జరిగే సర్వేను ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానం కేంద్రంగా ప్రారంభించారు. 5 స్క్వేర్ కి.మీ., మేర ఇక్కడి నుంచి సర్వే చేయనున్నారు. అనంతరం పట్టణంలోని మరో 5 కేంద్రాలను ఎంపిక చేసుకుని అక్కడి నుంచి సర్వే కొనసాగించనున్నారు.

పది రోజులపాటు..



మున్సిపాలిటీకి సంబంధించి బేసిక్‌మ్యాప్ సిద్ధం చేయడంతోపాటు అన్ని వివరాలు డిజిటలైజేషన్ చేయనున్నాం. పదిరోజులు పాటు డ్రోన్ సహాయంతో మున్సిపాలిటీలోని అన్ని వివరాలు నమోదు చేస్తాం. ప్రభుత్వ స్థలాలు, ఇండ్లు, నాలాలు, చెరువులు, కుంటల వివరాలు అన్ని డిజిటలైజ్ చేస్తాం. డిగ్రీ కళాశాల మైదానం కేంద్రంగా 5 స్క్వేర్ కి.మీటర్లు సర్వే చేస్తాం. పట్టణంలోని మరో 4 చోట్ల కేంద్రాలు ఏర్పాటు చేసుకుని సర్వే పూర్తిచేస్తాం. – గోపాల్‌రావు, సర్వేయర్, సర్వే ఆఫ్ ఇండియా

లెక్కింపు సులభం



సర్వే ఆఫ్ ఇండియా, అర్బన్ టౌన్ ప్లానింగ్ విభాగం సంయుక్త ఆధ్వర్యంలో డ్రోన్ సర్వే శుక్రవారం ప్రారంభమైంది. మున్సిపాలిటీ బేస్ మ్యాప్ సిద్ధం చేసి మాస్టర్ ప్లాన్ రూపొందించేందుకు ఇది ఉపయోగపడుతుంది. ప్రతి ఇంటిని డ్రోన్ ద్వారా ఫొటోలు తీసి డిజిటలైజేషన్ చేయడం వల్ల పన్నుల లెక్కింపు సులభమవుతుంది. పట్టణ విస్తీర్ణం పెరుగుతుండటంతో సర్వే ద్వారా మౌలిక అవసరాలు గుర్తించవచ్చు. – లక్ష్మారెడ్డి, మున్సిపల్ కమిషనర్, జడ్చర్ల

అన్నీ డిజిటలైజేషన్..

డ్రోన్ సహాయంతో మున్సిపాలిటీకి సంబంధించి పూర్తి వివరాలతో బేసిక్ మ్యాప్ సిద్ధం చేస్తారు. వీటిలో మున్సిపాలిటీ విస్తీర్ణం, హద్దులు గుర్తించనున్నారు. అలాగే అటవీ విస్తీర్ణం, ఖాళీ స్థలాలు, పార్కు స్థలాలు, నివాస గృహాలు, నాలాలు, కాల్వలు, రోడ్లు అన్నింటిని గుర్తించి డిజిటలైజేషన్ చేస్తారు. ప్రతి ఇంటి విస్తీర్ణం లెక్కించి డిజిటలైజేషన్ చేసి రికార్డు అన్నింటిని డీటీసీపీకి పంపిస్తారు. అక్కడి నుంచి తిరిగి మున్సిపాలిటీకి నివేదికలు చేరుతాయి. వాటి ఆధారంగా ఇంటి పన్నుల లెక్కింపు, ప్రభుత్వ స్థలాలను గుర్తించడం చేస్తారు. వీటితోపాటు భవిష్యత్ 20 ఏళ్ల కోసం మున్సిపాలిటీ అభివృద్ధికి మాస్టర్‌ప్లాన్ రూపొందించేందుకు డిజిటల్ సర్వే ఉపయోగపడుతుంది. అమృత్ 2.0 డిజిటల్ సర్వేలో చేసిన డిజిటలైజేషన్ ఆధారంగా నక్ష పథకం అమలుకు దోహదపడనుంది.

క్లుప్తంగా

పంప్‌మోడ్ పద్ధతిలో నీటి తరలింపు

దోమలపెంట: శ్రీశైలం భూగర్భ కేంద్రంలో పంప్‌మోడ్ పద్ధతిలో ఇరవై నాలుగు గంటల వ్యవధిలో సాగర్ జలాశయం నుంచి 4,856 క్యూసెక్కుల నీటిని శ్రీశైలం జలాశయంలోకి (ఎత్తిపోతల) తరలించారు. పోతిరెడ్డిపాడు ద్వారా 1,500 క్యూసెక్కులు, ముచ్చుమర్రి, మల్యాల ఎత్తిపోతల నుంచి హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్‌కు 1,589, రేగుమాన్‌గడ్డ నుంచి ఎంజీకెఎల్ఐకు 800 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. శుక్రవారం శ్రీశైలం జలాశయంలో నీటిమట్టం 864.1అడుగుల వద్ద 119.1976 టీఎంసీల నీటి నిల్వ ఉంది. సాయంత్రం భూగర్భ కేంద్రంలో విద్యుదుత్పత్తి చేస్తూ 35,315 క్యూసెక్కుల నీటిని దిగువన సాగర్‌కు విడుదల చేస్తున్నారు.

తాగు నీటికోసం 20 క్యూసెక్కుల వినియోగం

మదనాపురం: మండలంలోని రామన్‌పాడులో శుక్రవారం పూర్తిస్థాయి నీటిమట్టం 1,020 అడుగులకు చేరింది. జూరాల ఎడమ కాలువ ద్వారా 390క్యూసెక్కులు ఇన్‌ఫ్లో కొనసాగుతుండగా సమాంతర కాలువ ద్వారా వచ్చే నీటిని నిలిపివేశారు. ఎన్టీఆర్ కాలువ ద్వారా 800 క్యూసెక్కులు కుడి, ఎడమ కాలువ ద్వారా 45 క్యూసె క్కులు, తాగునీటి అవసరాల కోసం 20 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నట్లు ఏఈ వరప్రసాద్ తెలిపారు.

25 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత



చారకొండ: అక్రమంగా తరలిస్తున్న 25 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని శుక్రవారం పోలీసులు పట్టుకున్నారు. ఎస్‌ఐ శంషోద్దీన్ తెలిపిన వివరాలు.. కల్వకుర్తి నుంచి దేవరకొండకు బొలెరోలో బియ్యం తరలిస్తున్నట్లు సమాచారం అందింది. చారకొండలో వాహనాన్ని పట్టుకొని స్టేషన్‌కు తరలించి బియ్యాన్ని స్వాధీన పర్చుకున్నారు.ఆర్‌ఐ రామకృష్ణ పంచనామా నిర్వహించారు. డ్రైవర్‌పై కేసు నమోదు చేసి, నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఆర్‌ఎన్‌ఆర్ క్వింటాల్ రూ.2,739



జడ్చర్ల/నవాబుపేట: బాదేపల్లి మార్కెట్‌లో శుక్రవారం ధాన్యం ఆర్‌ఎన్‌ఆర్ క్వింటాల్ గరిష్టంగా రూ.2,739, కనిష్టంగా రూ.1,866, హంస గరిష్టంగా రూ.2,200, కనిష్టంగా రూ.1,929, మొక్కజొన్న గరిష్టంగా రూ.2,417, కనిష్టంగా రూ.2,240, వేరుశనగ గరిష్టంగా రూ.6,197, కనిష్టంగా రూ.5,790, జొన్నలు రూ.2061 ధరలు లభించాయి.

■ నవాబుపేట మార్కెట్‌కు ధాన్యం పోటెత్తింది.5,590 బస్తాల ధాన్యం రావడంతో మార్కెట్ నిండిపోయింది. ధాన్యం ఎక్కువగా రావడంతో అదనంగా టెండర్లు వేయాలని రైతులు కోరారు. ఆదివారం కూడా టెండర్లు జరుగుతాయని, ధాన్యాన్ని బట్టి అదనపు టెండర్లు వేసేలా చూస్తామని మార్కెట్ చైర్మన్ లింగం తెలిపారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు



భూత్పూర్: వైద్య సిబ్బంది విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని డీఎంహెచ్‌ఓ డా.కృష్ణ హెచ్చరించారు. శుక్రవారం మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీచేశారు. వైద్యసిబ్బంది తమవిధులు సక్ర మంగా నిర్వహించాలని సూచించారు. ఆసుపత్రి పరిధిలో ఎంత మందిని డెలివరీ చేశారని, నెలవారీ వివరాలు తెలిపే బోర్డును ఆస్పత్రిలో ఎందుకు పెట్టలేదని వైద్యాధికారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. డెలివరీ వివరాలు కూడా చెప్పకపోవడంపై డీఎంహెచ్‌ఓ మండిపడ్డారు.

వ్యక్తిపై కోతి దాడి

నాగర్‌కర్నూల్ క్రైం: జిల్లా కేంద్రంలోని ఎమ్మార్వో కార్యాలయం ఆవరణలో వ్యక్తిపై కోతి దాడి చేసిన ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం తాడూరు మండల కేంద్రానికి చెందిన మద్దిలేటి వ్యక్తిగత పనులపై జిల్లా కేంద్రంలోని ఎమ్మార్వో కార్యాలయానికి వచ్చాడు. ఆకస్మాత్తుగా అతనిపై కోతి దాడి చేసింది. ఈ ఘటనలో మద్దిలేటికి స్వల్ప గాయాలయ్యాయి. అతడిని చికిత్స నిమిత్తం జనరల్ ఆస్పత్రికి తరలించారు.

కళాశాలల్లో మౌలిక వసతులు కల్పించాలి


వీసీ శ్రీనివాస్‌తో ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల ప్రిన్సిపాళ్లు, కరస్పాండెంట్లు

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): పీయూ పరిధిలోని డిగ్రీ, పీజీ ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల్లో మౌలిక వసతులు కల్పించాలని వీసీ జీఎన్ శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం ఫార్మసీ ఆడిటోరియంలో పీయూ పరిధిలోని డిగ్రీ, పీజీ ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల ప్రిన్సిపాళ్లు, కరస్పాండెంట్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సకాలంలో సిలబస్ పూర్తి చేయాలని డిగ్రీ, పీజీలో ఫ్యాకల్టీని నియమించుకోవాలన్నారు. విద్యార్థినుల సంరక్షణ కోసం ప్రత్యేక వాష్ రూంలు, సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. కొన్ని ప్రైవేట్ కళాశాలల్లో అధిక ఫీజులతో విద్యార్థులను వేధించడం మానుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ చెన్నప్ప, ఓఎస్డీ మధుసూదన్‌రెడ్డి, పరీక్షల నియంత్రణ అధికారి రాజుకుమార్, జేడీ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

రక్తదానంతో ప్రాణాలు కాపాడుదాం

ఆపదలో ఉన్న వాళ్లకు రక్తదానం చేసి వారి ప్రాణాలను కాపాడుదామని వీసీ అన్నారు. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ ఆధ్వర్యంలో శుక్రవారం బ్యాంక్‌లో రక్తదాన శిబిరం నిర్వహించగా వీసీ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. రక్తదానం చేయడంపై చాలా మందిలో అపోహలు ఉంటాయని అలాంటివి పెట్టుకోవద్దన్నారు. సామాజిక సేవలో భాగంగా బ్యాంక్ వారు రక్తదానం చేయడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో 62 యూనిట్ల రక్తాన్ని సేకరించినట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌గౌడ్, ముడా చైర్మన్ లక్ష్మణ్‌యాదవ్, బ్యాంక్ క్లస్టర్ హెడ్ అశోక్, బ్రాంచ్ మేనేజర్ రాజశేఖర్, సీనియర్ మేనేజర్ అశ్విన్, రజనీకాంత్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

గూడ్స్ రైలు బొగ్గు బోగిలో పొగలు


జడ్చర్ల రైల్వేస్టేషన్‌లో గూడ్స్ రైలు బోగిలో పొగలు ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

- జడ్చర్ల స్టేషన్‌లో నిలిపివేత
- ఫైరింజన్ సహాయంతో పొగలు ఆర్పిన సిబ్బంది

జడ్చర్ల టౌన్: కాజీపేట నుంచి రాయచూర్ థర్మల్ విద్యుత్ కేంద్రానికి శుక్రవారం బొగ్గు తీసుకువెళ్తున్న గూడ్స్ రైలు బొగ్గు బోగిలో పొగలు రావడంతో పైలెట్, కో పైలెట్‌లు గుర్తించి మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల రైల్వేస్టేషన్‌లో రైలును నిలిపివేసి.. ఫైరింజన్ సహాయంతో పొగలు ఆర్పారు. ఈ ఘటనకు సంబంధించి వివరాలిలా.. కాజీపేట స్టేషన్ నుంచి బొగ్గు లోడ్‌తో గూడ్స్ రైలు రాయచూర్‌కు బయలుదేరింది. మార్గమధ్యలో శంషాబాద్ సమీపంలో బొగ్గు క్యాబిన్ నుంచి పొగలు రావడంతో అక్కడ నిలిపివేసి ఫైరింజన్ సహాయంతో ఆర్పేశారు. పొగలు ఆరిపోయాక తిరిగి గూడ్స్ రైలు బయలుదేరింది. అయితే గొల్లపల్లి స్టేషన్ సమీపంలో తిరిగి పొగలు వస్తుండటాన్ని పైలెట్, కోపైలెట్ గమనించి జడ్చర్ల రైల్వేస్టేషన్‌లో రైలును నిలిపివేసి.. ఫైర్ స్టేషన్‌కు సమాచారం ఇచ్చారు. ఫైర్ సిబ్బంది స్టేషన్‌కు చేరుకుని బొగ్గు క్యాబిన్‌లోని పొగలు ఆర్పేందుకు తీవ్రంగా శ్రమించారు. అయితే బొగ్గు సరఫరాలో ఇలాంటివి సర్వసాధారణమని, బొగ్గు వేడి కారణంగా పొగలు వస్తాయని, వాటిని ఆర్పుతూ ముందుకు వెళ్తామని సిబ్బంది చెప్పారు.

కార్మిక, కర్షక వర్గాన్ని అణచివేసేందుకు కుట్రలు


మాట్లాడుతున్న కేవీపీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు జాన్‌వేస్లి

అమరచింత: కేంద్రంలోని మోదీ ప్రభుత్వం కార్మిక, కర్షక వర్గాన్ని అణచివేసేందుకు కుట్రలు చేస్తోందని కేవీపీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు జాన్‌వేస్లి అన్నారు. మండల కేంద్రంలోని జీఎస్ భవన్‌లో శుక్రవారం నిర్వహించిన సీపీఎం, ప్రజాసంఘాల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మికుల హక్కులను కాలరాస్తూ.. నిరంకుశంగా పరిపాలిస్తుందన్నారు. కార్మిక, కర్షక వర్గానికి సంబంధించిన 29 చట్టాలను రద్దుచేసి, నాలుగు లేబర్ కోడ్‌లుగా తీసుకురావడం ఏమిటని ప్రశ్నించారు. ఆ లేబర్ కోడ్‌లతో కార్మికులు కనీస వేతనాలు అడిగే హక్కు కూడా లేకుండా పోతుందన్నారు. వ్యవసాయ కూలీల కోసం తీసుకువచ్చిన ఉపాధి హామీ చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం తుంగలో తొక్కిందన్నారు. ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని నిరుద్యోగులను మోసం చేసిందని.. ప్రజల మధ్య మతచిచ్చు పెడుతూ మతోన్మాదాన్ని పెంచుతుందని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలపై పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. అనంతరం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రభాకర్, జీఎస్ గోపి, రమేష్, వెంకటేష్, అజయ్, బుచ్చన్న, శ్యాంసుందర్, వెంకటేష్, హరికృష్ణ, రేణుకలత, వసంత పాల్గొన్నారు.

నకిలీ మందులు అమ్మితే చర్యలు



అమరచింత: ఫర్టిలైజర్ దుకాణాల్లో రైతులకు నకిలీ మందులు, ఎరువులను విక్రయిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని ఏడీఏ దామోదర్ హెచ్చరించారు. మండలంలోని అమరచింత, చింతరెడ్డిపల్లె, ఈర్లదిన్నె గ్రామాల్లోని ఫర్టిలైజర్ దుకాణాల్లో శుక్రవారం ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఫర్టిలైజర్ దుకాణాల్లోని స్టాక్ రిజిస్టర్లను పరిశీలించారు. అనంతరం ఏడీఏ మాట్లాడుతూ.. రైతులకు అవసరమైన సమయంలో ఎరువులను అందుబాటులో ఉంచాలని.. లేని పక్షంలో పంటలకు సకాలంలో ఎరువులు అందక దిగుబడి తగ్గి నష్టపోయే పరిస్థితులు ఉంటాయన్నారు. ఫర్టిలైజర్ దుకాణాల్లో ఎరువులు, విత్తనాలను కొనే టప్పుడు పీఓఎస్ యంత్రంలో ఎంట్రీ చేసిన తర్వాతే కొనాలని రైతులకు సూచించారు. ఆయన వెంట ఏఓ అరవింద్, ఏఈఓ మల్లేష్ ఉన్నారు.

కల్తీ ఆహారం విక్రయాలపై నిఘా

వనపర్తి: జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్న హోటళ్లు, రెస్టారెంట్లలో కల్తీ ఆహార విక్రయాలపై నిఘా పెట్టినట్లు జిల్లా ఫుడ్ ఇన్‌స్పెక్టర్ నీలిమ అన్నారు. శుక్రవారం ఎస్పీ రావుల గిరిధర్ సూచన మేరకు పోలీసు బృందంతో కలిసి జిల్లా కేంద్రంలోని పలు హోటళ్లలో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఆహార నిబంధనలు పాటించని సంగీత, ఇతర హోటళ్ల యజమానులకు నోటీసులు జారీ చేసినట్లు ఆమె తెలిపారు. మరికొన్ని హోటళ్ల యజమానులకు నిబంధనలు పాటించాలని హెచ్చరించినట్లు పేర్కొన్నారు. కాగా, కొన్ని హోటళ్లలో ఆహారం కొనటమంటే.. డబ్బులిచ్చి అనారోగ్యం కొన్నట్టు ఉందని అందిన ఫిర్యాదులకు స్పందించిన ఎస్పీ.. హోటళ్ల తనిఖీ కోసం ప్రత్యేక పోలీస్ బృందాన్ని ఏర్పాటుచేశారు. జిల్లా ఫుడ్ ఇన్‌స్పెక్టర్ వెంట సీసీఎస్ హెడ్ కానిస్టేబుల్ తిరుపతిరెడ్డి తదితరులు ఉన్నారు.


హోటల్‌లో తయారు చేసిన ఆహార పదార్థాలను పరిశీలిస్తున్న ఫుడ్ ఇన్‌స్పెక్టర్ నీలిమ

నారుమడి యాజమాన్య పద్ధతులు


బిజ్జారం శివారులో యాసంగి కోసం వేసిన నారుమడి

- విత్తనశుద్ధితో తెగుళ్ల నివారణ
- జాన్ సుధాకర్, డీఏఓ, నారాయణపేట

కోస్గి: యాసంగి సీజన్ ప్రారంభం కావడంతో వరిసాగు చేసే రైతులు వరినారు పోసుకునేందుకు సిద్ధమవుతున్నారు. బోరు బావుల కింద వరిసాగు కోసం నారుమళ్లు సిద్ధం చేసేందుకు సన్నద్ధమవుతున్న నేపథ్యంలో రైతులు పాటించాల్సిన నారుమడి యాజమాన్య పద్ధతులు, విత్తనశుద్ధితో ప్రయోజనాలను జిల్లా వ్యవసాయాధికారి జాన్ సుధాకర్ వివరించారు.

విత్తన శుద్ధి

నారుపోసే ముందు విత్తన శుద్ధి చేస్తే పలు రకాల కీటకాలు, తెగుళ్లు ఆశించకుండా నివారించుకోవచ్చు. 1 కిలో విత్తనాలను 2.5 గ్రాముల కార్బండిజమ్‌తో కలిపి 24 గంటలు నానబెట్టాలి. 1 కిలో విత్తనాలకు 3 గ్రాముల కాప్టన్ మందు కలిపి మడిలో చల్లుకోవాలి. దీనివల్ల నారుమడిలో ఆకుతినే పురుగు, ఉల్లికోడు, ముప్ప పురుగు ఆశించకుండా ఉంటాయి.

అధికారి సలహా


జాన్ సుధాకర్, డీఏఓ, నారాయణపేట

నారుమడి తయారీ

■ నారు పోయాల్సిన మడిని 10–12 రోజుల్లో మూడు దఫాలుగా దున్ని చదును చేయాలి. నీరు పెట్టడానికి, ఎక్కువైతే తీయడానికి అనుకూలంగా తయారు చేసుకోవాలి.

■ ఎకరా పొలం నాటడానికి 5 సెంట్లు (500 చదరపు మీ.) నారుమడి అవసరం. సెంటు భూమికి 5 కిలోల విత్తనాలు వాడాలి.

■ 5 సెంట్ల నారుమడికి 2 కిలోల నత్రజని, కిలో భాస్వరం, కిలో పొటాష్ ఉండే ఎరువులు వాడాలి.

కలుపు నివారణ

■ నారుమడిలో కలుపు నివారణకు ఎకరాకు బూటాక్లోర్ 1.5 లీటర్లు, 200 లీటర్ల నీటిలో కలిపి విత్తిన 7లేదా 8వ రోజున మడిలో నీటిని తొలగించి పిచికారి చేయాలి.

నాటు వేసుకునే విధానం

నాటు వేసే నారులో 4 నుంచి 6 ఆకులు ఉన్న నారును ఉపయోగించాలి. ముదురు నారు నాటితే దిగుబడి తగ్గుతుంది. నారు లోతులో కాకుండా పైపైన నాటితే ఎక్కువగా పిలకలు వచ్చే అవకాశం ఉంది. నాట్లు వేసేటప్పుడు భూ సారాన్ని బట్టి ఖరీఫ్‌లో చదరపు మీటర్‌కు 44 దంట్లు(నారు మొలకలు) ఉండేలా నాటుకోవాలి.

■ విత్తిన 15 రోజులకు సైహాలో పాస్ బ్యూటైల్ 10 శాతం మందు 400 మీ.లీ.ను 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారి చేయాలి.

■ విత్తిన 10 రోజుల్లో కార్బోఫ్యూరాన్ 3జీ గుళికలు సెంటు నారుమడికి 150 గ్రాముల చొప్పున వేయాలి. లేదా మోనో క్రోటోపాస్ 1.6 మీ.లీ మందును లీటర్ నీటిలో కలిపి విత్తిన 10 రోజులకు పిచికారి చేయాలి.

■ జింక్ లోపాన్ని గమనిస్తే లీటర్ నీటిలో 2 గ్రాముల జింక్ పాస్ఫేట్ ద్రావణాన్ని పిచికారి చేయాలి.

చలి ప్రభావం నుంచి రక్షణ..

యాసంగిలో చలి ప్రభావం నుంచి నారు మడుల్లో నారు ఎదగక పోవటం, ఆకులు పసుపు, ఎరుపు రంగుల్లోకి మారడంతోపాటు కొన్నిసార్లు నారుమడి చనిపోవడం జరుగుతుంది. ఇందుకు రైతులు కింది జాగ్రత్తలు తీసుకోవాలి.

■ సాయంత్రం వేళలో నారుమడిలో నీరు తీసేసి పగటిపూట వెచ్చటి నీరు పెట్టాలి. – రోజు సాయంత్రం ఒక అడుగు ఎత్తులో వెదురు బద్దలు అమర్చి దానిమీద సన్నటి ప్లాస్టిక్ షీట్ లేదా కల్లాలకు వాడే పట్టాలు నారుమడి మీద కప్పి మరుసటి రోజు ఉదయం తీసేయాలి.

■ జింక్ లోపం వలన ఆకులపై తుప్పు మచ్చలు ఏర్పడితే జింక్ సల్ఫేట్‌ను ఒక లీటర్ నీటికి 2 గ్రాముల చొప్పున కలిపి పిచికారి చేయాలి.

అంబరాన్నంటిన ప్రజాపాలన సంబరాలు


కళాకారుల సంప్రదాయ నృత్య ప్రదర్శన


నృత్య ప్రదర్శన ఇస్తున్న చిన్నారి

వనపర్తి: జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాల మైదానంలో శుక్రవారం నిర్వహించిన ప్రజాపాలన సంబరాలు అంబరాన్నంటాయి. ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా రాష్ట్ర సాంస్కృతిక సారథి ఆధ్వర్యంలో 'ప్రజా ప్రభుత్వం పిలిచింది' కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్రస్థాయి కళాకారులు తమ ప్రదర్శనలతో అలరించారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటివరకు ప్రవేశ పెట్టిన పథకాలపై ప్రముఖ కళాకారుడు అంతడుపుల నాగరాజు బృందం ప్రదర్శనలు ఇచ్చారు. కలెక్టర్ ఆదర్శ్ సురభి, ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి, అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు తిలకించారు. తెలంగాణ పోరాటయోధుల వీరగాథలు, పోతరాజులు, బతుకమ్మ నృత్యాల ప్రదర్శనలు చూపరులను ఆకట్టుకున్నాయి. కళాకారులకు కలెక్టర్, ఎమ్మెల్యే మెమొంటోలు అందజేసి, శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో డీపీఆర్‌ఓ సీతారాం, మున్సిపల్ చైర్మన్ పి.మహేష్ తదితరులు పాల్గొన్నారు.

వైద్యుల సూచనలు పాటించాలి



ఖిల్లాఘనపురం: సహజంగా వచ్చే నొప్పుల నుంచి ఉపశమనం పొందేందుకు తరచూగా పెయిన్ కిల్లర్స్ వాడటం మంచిది కాదని రాష్ట్ర వైద్యారోగ్యశాఖ అధికారులు రాజశేఖర్, నాయుడు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఎమ్మార్సీ భవనంలో ఎంఈఓ జయశంకర్ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల హెచ్‌ఎంలకు ఫిజియోథెరపిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తరచూగా పెయిన్ కిల్లర్ మందులు వాడటం వల్ల సైడ్ ఎఫెక్ట్ ఏర్పడే అవకాశం ఉంటుందన్నారు. అదే విధంగా ఎక్కువగా సెల్‌ఫోన్ వాడకంతో ఆరోగ్య సమస్యలు వస్తాయన్నారు. అనంతరం ఉపాధ్యాయులకు ఫిజియోథెరపిపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎం మునావర్ సుల్తానా పాల్గొన్నారు.

ఈ-చలాన్స్‌పై స్పెషల్ డ్రైవ్



మహబూబ్‌నగర్ క్రైం: జిల్లాకేంద్రంలో ట్రాఫిక్ పోలీసులు శుక్రవారం సాయంత్రం విస్తృతం వాహనాల తనిఖీలు నిర్వహించారు. కొత్తగా విధుల్లో చేరిన కానిస్టేబుల్స్‌కు విధుల శిక్షణలో భాగంగా ట్రాఫిక్ విధులు ఎలా నిర్వహించాలి, వాహనదారులతో ఎలా ప్రవర్తించాలి అనే అంశంపై ఈ స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ప్రధానంగా ద్విచక్ర వాహనాలు, కార్లపై దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న ఈ-చలాన్ కేసులను పరిశీల నలో భాగంగా ఆయా వాహనాలు నిలిపి సదరు వాహనాలపై పెండింగ్ చలాన్స్ పరిశీలించారు.